క్లుప్తంగా

నేడు ఏకాహం

అడ్డతీగల: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మండల కేంద్రంలోని మార్కెట్ వీధిలోని కోదండ రామాలయం ప్రాంగణంలో ఏకాహం నిర్వహిస్తున్నటు సాయి భజన మండలి, లలిత సత్సంగ సభ్యులు తెలిపారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

టీఐఎస్ నమోదు పరిశీలన



టిఐఎస్ నమోదును పరిశీలిస్తున్న ఏజన్సీ డీఈఓ మల్లేశ్వరరావు

గంగవరం: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయు సమాచార వివరాలు (టిఐఎస్) నమోదు ప్రక్రియను ఏజన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు పరిశీలించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలు కంప్యూటీకరణ పనులను ఆయన పర్యవేక్షించి, పలు సూచనలిచ్చారు. హెచ్ఎం నాగేశ్వరరావు , చిన్నారావు, చిన్నారెడ్డి, డేటా ఆపరేటర్ మంగిరెడ్డి తదితరులున్నారు.

జీడీమామిడి సాగుతో లాభాలు



మాట్లాడుతున్న లక్ష్మీ సునీత

కొయ్యూరు: మండలంలోని అంతాడలో గురువారం రేవతి చారిటబుల్ ట్రస్ట్ ఎండీ సీహెచ్ వీఆర్వి ప్రసాద్, లిఫ్ట్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు వి.అప్పారావు ఆధ్వర్యంలో జీడి ప్రాసెసింగ్‌పై రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అగ్రో పుడ్స్ సీఈవో గంధం లక్ష్మీ సునీత మాట్లాడుతూ రైతులు జీడి పండ్ల ద్వారా కూడా లాభాలను పొందవచ్చన్నారు. పండ్లను ప్రాసెసింగ్ చేస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. అయితే ప్రాసెసింగ్ కోసం సంస్థలు ముందుకు వచ్చి రైతులను ప్రాత్సహించాలన్నారు. మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. ఆదాయ మార్గాలను వివరించారు. సర్పంచ్ చంద్రరావు, మాజీ సర్పంచ్ సన్యాసిరావు, రమేష్, రాజు, చంద్రరావు, అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పనులపై ప్రత్యేక దృష్టి



సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో గురువారం ఎంపీడీవో కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరి గ్రామాల్లో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ లాలం సీతయ్య, హౌసింగ్ ఏఈఈ నాగేశ్వరరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కోడి పందాలు, జూదం ఆడితే చర్యలు



నెల్లిపూడిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

గంగవరం : సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఏ విధమైన కోడి పందాలు, జూదాటలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ బి.వెంకటేశ్ హెచ్చరించారు. మండలంలోని నెల్లిపూడిలో ఆయన గురువారం సందర్శించి, స్థానిక యువతతో సమావేశాన్ని నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు జోద క్రీడలకు దూరంగా ఉంటూ వాలీబాల్, కబాడీ, ముగ్గులపోటీలు వంటి ఆడుకోవాలని వాటిని ప్రోత్సహిస్తామన్నారు. అసాంఘీక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



కురిడిలో బస్సు షెల్టర్ దుస్థితి



దుంబ్రిగుడలో బస్సు షెల్టర్ లేక పోవడంతో ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు



దుంబ్రిగుడలో అసంపూర్తిగా ఉన్న బస్సు షెల్టర్

వెతలు తీరేనా?

- నిలువ నీడ కరువు
- ప్రయాణికులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



జైపూర్ జంక్షన్‌లో నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంత, జైపూర్ జంక్షన్, కురిడి, చాపరాయి, డుంబ్రిగుడ, బిల్లాపుట్టు, కించుమండ జంక్షన్‌లలో గతంలో బస్ షెల్టర్లు ఉండేవి. ప్రయాణికులకు ఇబ్బందులు ఉండేవి కావు.

విజయనగరం–రాజమహేంద్రవరం జాతీయ హైవే రోడ్డు నిర్మాణం చేపట్టడంతో రోడ్డు విస్తరణ జరిగింది. దీంతో ఆయా ప్రదేశాల్లో ఉన్న బస్సు షెల్టర్‌లను తొలగించారు. ఆయా స్థానాలో బస్సు కాంప్లెక్స్‌లు కాకుండా పలు చోట్ల దూరంగా నిర్మాణాలు చేపట్టడంతో ప్రయాణికలు బస్సులు, ప్రవేటు వాహనాలు ఎక్కేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా, వానైనా ఆరుబయటే రోడ్డుపైనే పడికాపులు కాస్తూ నిరీక్షిస్తున్నారు.

ఆరుబయటే నిరీక్షణ

అరకు సంతబయిలులో ఏర్పాటు చేసి బస్సు కాంప్లెక్స్ ప్రయాణికులకు ఏ విధంగా ఉపయోగంలో లేకుండా నిర్మించారు. గతంలో జైపూర్ జంక్షన్‌లో వద్ద పాడేరు రోడ్డులో బస్సు కాంప్లెక్స్ ఉండేది.. ఇందులో ఒడిశా నుంచి వచ్చే ప్రయాణికలు బస్సు కోసం నిరిక్షించేవారు. ప్రస్తుతం అది లేకుండా పోవడంతో రెండు రాష్ట్రాల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. హైవే ఎత్తు పెంచడంతో కురిడి వద్ద ఉన్న బస్సు షెల్టర్ పూర్తిగా రోడ్డులో దిగిపోయి, శిథిలావస్థకు చేరింది. ఆ ప్రదేశంలో కొత్త బస్సు షెల్టర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. చాపరాయి వద్ద గతంలో చాపరాయి ముఖద్వారం వద్ద బస్సు షెల్టర్ ఉండేది.. అది తొలగించి దూరంలో నిర్మించిన రెండు షెల్టర్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. బస్సు కోసం నిరిక్షించేందుకు కాకుండా ఇక్కడ యాచకులకు విశ్రాంతి నిలయంగా మారింది. డుంబ్రిగుడ కేంద్రంలో ఉన్న బస్ కాంప్లెక్స్ పాడేరు, అరకు, గుంటసీమ ప్రాంతాల ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. అయితే దీన్ని తొలగించడంతో ప్రయాణికులు ఆరుబయటే బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అరకు రోడ్డు దూరంలో నిర్మించారు. పాడేరు రోడ్డులో బంకు వైపు నిర్మాణం నేటికి అసంపూర్తిగా ఉంది. బిల్లాపుట్టు జంక్షన్‌లో ఉన్న బస్సు షెల్టర్‌ను తొలగించారు. కించుమండలో రెండు షెల్టర్‌లను నిర్మిస్తున్నారు నేటికి అవి పూర్తి చేయకుండా వదిలేశారు. వారపుసంతతో నిర్మాణంలో ఉంది. ఒంటిపాక జంక్షన్‌లో పాడేరు రోడ్డులో బస్సు షెల్టర్ నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్ఐ రాజు వద్ద ప్రస్తావించగా ఈ సమస్యను హైవే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలియజేస్తామన్నారు.

> **అధికారులు స్పందించాలి**
>
> 
>
> రోడ్డు విస్తరణలో బస్సు కాంప్లెక్స్‌లు తొలగించడంతో డుంబ్రిగుడ ప్రధాన రహదారిలో బస్సులు, ప్రవేటు ఆటోలు, వాహనాలు ఎక్కేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సరైన చోట షెల్టర్లు లేక ఎండ, వాన, చలిలో వాహనాల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు దూరంలో నిర్మించిన బస్సు షెల్టర్ల్ గతంలో ఏర్పాటుచేసిన చోటే నిర్మిస్తే ప్రతి ఒక్కరికి సౌకర్యంగా ఉండేది.
>
> – సులోచన, డుంబ్రిగుడ

రోడ్డు పనులు ప్రారంభం



కర్లపాదర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ త్రినాథ్, నేతలు



ఎటపాకలో సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ కర్లపాదర్ గ్రామంలో గురువారం సర్పంచ్ కె.త్రినాథ్ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డు మంజూరు చేసిన జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నాయకులు సాధురాం, బుద్ధు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని గన్నవరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజు, ఉప సర్పంచ్ స్వర్ణ గురువారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఈ ఎర్రయ్య పాల్గొన్నారు.

కాలం చెల్లిన సరకుల విక్రయదారులపై చర్యలు



తహసీల్దార్ నర్సమ్మకు ఫిర్యాదు చేస్తున్న ప్రసన్నకుమార్, బాధిత చిన్నారి తండ్రి సుబ్రహ్మణ్యం

ముంచంగిపుట్టు: కాలం చెల్లిన సరకులు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సొనియా ప్రసన్నకుమార్, బాధితులు కోరారు. వారు గురువారం తహసీల్దార్ నర్సమ్మను కలిసి కాలం చెల్లిన పెరుగు ప్యాకెట్ వల్ల తమ చిన్నారి పూజరాణి తీవ్ర అస్వస్థతకు గురైందని తండ్రి సుబ్రహ్మణ్యం ర్యాదు చేశారు. రానున్న రోజుల్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సదరు వ్యాపారి ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ కాలం చెల్లిన పెరుగు ప్యాకెట్ అమ్మిన వ్యాపారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పరిహారం అందించాలని డిమాండ్

గూడెంకొత్తవీధి: జాతీయ రహదారి ఎన్‌హెచ్ 516–ఈ విస్తరణ వల్ల తమ కాఫీతోటలు, విలువైన భూములు అనేకం దెబ్బతిన్నాయని వాటికి ప్రభుత్వం తగిన నష్ట పరిహారం చెల్లించాలని మండలంలోని పెదవలస పంచాయతీ పరిధిలోని రైతులు డిమాండ్ చేశారు. గురువారంజాతీయ రహదారి పనులు చేపడుతున్న సిబ్బంది వాహనాలను వారు అడ్డగించి తమ గోడును వెల్లబుచ్చారు. గతంలో అధికారులు సర్వే చేపట్టారని మొదటిసారి చేసిన సర్వేలో ఒకలా రెండోసారి నిర్వహించిన సర్వేలో మరోలా నష్టపరిహారం ఇవ్వడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జాతీయరహదారి విస్తరణలో విలువైన భూములు, పంటలు కాఫీ తోటలను కోల్పోయిన వారిని గుర్తించి వారందరికీ సమన్యాయం చేయాలని వారు అధికారులను కోరారు.

సంప్రదాయ పంటల పరిరక్షణపై అవగాహన

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతాల్లో సంప్రదాయ పంటలను పరిరక్షించుకోవాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దుచ్చరి పాలెంలో చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులతో కలసి ఆయన గ్రామంలో గిరిజన రైతులతో మాట్లాడారు. గిరిజనులు పండిస్తున్న సంప్రదాయ పంటలతో పాటు వ్యవసాయ విధానాలను అడిగి తెలసుకున్నారు. వ్యవసాయ సహాయకులు సంగీత, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు భీమేశ్వరపడాల్, రైతులు బంగార్రాజు, గోపి, బ్రహ్మాజీ శ్రీను, బీమరావు, రామచంద్ర ధనుంజై, జీవ తదితరులు పాల్గొన్నారు.

పీవో దృష్టికి గిరిజనుల సమస్యలు



ఐటీడీఏ పీవో అభిషేక్‌ను కలిసిన పీసా కమిటీ సభ్యులు

పాడేరు రూరల్: పాడేరు మేజర్ పంచాయతీ పరిధిలో గల పాడేరు, గుడివాడ, సుండ్రుపుట్టు, పీసా ఉపాధ్యక్షులు, సల్ల రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, ధనటి రాంబాబు, కార్యదర్శులు రాధాకృష్ణ నాయుడు, సింహాచలం గురువారం ఐటీడీఏ పీవో అభిషేక్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందశారు. గిరిజన హక్కులు చట్టాలు, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లిన్నట్టు వారు చెప్పారు, నూతనంగా ఎన్నికై న ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఆయన అభినంధించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పీసా చట్టాలు అమలుకు అందరూ సహకరించలన్నారు, గ్రామ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు, గిరిజన చట్టాలు హక్కులు అమలుకు అందరూ సమన్యాయంగా కృషి చేయాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ కన్నపరాజు తదితరులు

ఎటపాక: సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎటపాక సీఐ కన్నపరాజు గురువారం ఆవిష్కరించారు. ఆర్టీఐ జిల్లా కన్వీనర్ హరినాథ్ అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ అప్పలరాజు, ఆర్టీఐ జిల్లా కో–కన్వీనర్ సతీష్‌కుమార్, రమేష్ ,పవన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్

చింతూరు: మండలంలోని గూడూరుకు చెందిన సున్నం ఎర్రయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి జెకె చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ గురువారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడి కుటుంబం ఆర్థిక స్థితిని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆయన ట్రస్ట్ తరపున ఆ కుటుంబానికి వితరణ ఇచ్చారు. ట్రస్ట్ సభ్యులు రసూల్, చందు పాల్గొన్నారు.

రుణాల రికవరీపై సమీక్ష



సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం : మండలంలో మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు ద్వారా ఇచ్చిన రుణాలు రికవరీపై మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పీజీ రామకృష్ణ వెలుగు సిబ్బందిని సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాంక్ లింకేజ్, స్త్రీ నిధి రుణాల రికవరీలపై ఎంపీడీఓ రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. వెలుగు ఏపీఎం షణ్ముఖరావు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ జగదీష్‌కుమార్, క్యాష్ ఆఫీసర్ లక్ష్మణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ప్రసాద్

కొయ్యూరు: మండలంలోని చిట్టింపాడు పంచాయతీ రామన్నపాలెంలో మహిళలకు దానధర్మ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో డి.వి.డి.ప్రసాద్ గురువారం చీరలు పంపిణీ చేవారు. అనంతరం మూలపేట రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 108 ఆలయాలకు పూజా సామగ్రి అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి: పీఎంఎంవీవై కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆస్పత్రిలో గర్భిణులకు గురువారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అనూష మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. సుమారు 48 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వాడకంతో పాటు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి రోజా సూచించారు.

మండల సమావేశం రసాభాస



మాట్లాడుతున్న ఎంపీడీవో లవరాజు



సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్తున్న సభ్యలను సముదాయిస్తున్న ఎంపీడీవో లవరాజు

అరకులోయటౌన్: అరకులోయలోని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులంతా బహిష్కరించారు. మధ్యాహ్నం 12 గంటలైనా సమావేశానికి కేవలం అయిదు శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. సభ్యులంతా వేచి చూసి సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశానికి సంబంధించి ముందస్తుగానే అధికారులకు సమాచారం ఇచ్చిన హాజరుకాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసి, గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఇకపై మండల సమావేశానికి తామంతా హాజరుకామని ఎంపీడీవో లవరాజుకు సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు తీర్మానం చేశారు. ఎంపీడీవో లవరాజు మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో లవరాజు చెప్పారు. వైస్ ఎంపీపీ రామన్న, సుమాంజలి, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్ కుమార్, లక్ష్మీ, భీమరాజు, కుమారి, శత్రుఘ్న, రామచందర్, జానకి, సర్పంచ్‌లు భాస్కర్‌రావు, రమేష్, బొజ్జి, బుటికి, సుస్మిత, ఉపేంద్ర, పాల్గొన్నారు.

మహిళా చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

చింతూరు: మహిళలపై అకృత్యాలు పెరిగి పోతున్నాయని, మహిళా చట్టాలు ఉన్నా సరిగా అమలు జరగడం లేదని ఐద్వా మహిళా సంఘం నాయకులు విమర్శించారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఐద్వా మహిళా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అఘాయిత్యాలకు గురవుతున్న సంఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. మహిళా చట్టాలు ప్రచారానికి మాత్రమే పరిమితమవుతున్నాయన్నారు. దారుణాలకు కారణమైన మద్యం, డ్రగ్స్ ను నియంత్రించాల్సిన కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చాక వాటి అమలు లేకుండా పోయిందని వారు తెలిపారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బమ్మ, రంగమ్మ, జయలక్ష్మి, నాగమణి, మాధవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ మాట్లడుతూ మండలంలో బంజరు భూములు, పోరంబోకు స్థలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనేతరులకు జారీ అయిన ఎస్టీ సర్టిఫికెట్లపై దర్యాప్తు చేసి, రద్దు చేస్తామన్నారు. ఖాళీగా ఉన్న భూములను కొంతమంది గిరిజనులు, గిరిజనేతరులు ఆక్రమణ చేసుకుంటే చర్యలు తీసుకుంగామని హెచ్చరించారు. సర్పంచ్ వి.వెంకటరావు, వీఆర్‌వో సత్యనారాయణ, మాజీ జెడ్పీటసీ శ్రీరాములు, భగవన్, సుబ్బారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



చింతపల్లిలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: చింతపల్లి మేజర్ పంచాయితీలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు వీధుల్లో ఏర్పాటు చేసిన చెత్త బుట్టలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. స్థానికంగా అన్ని పురవీదుల్లో ఐరన్ చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ ఏర్పాటు చేసిన బుట్టలను వాడుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యదర్శి శ్రీధర్ ,ముత్తా శ్రీనివాసరావు తదతరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్





జోడిమామిడి, రాజవొమ్మంగిలో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

డుంబ్రిగుడ/రాజవొమ్మంగి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తక్షణమే అమిత్ షాను తన పదవికి రాజీనామా చేయాలని అరకులోయ, రాజవొమ్మంగి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ చేస్తూ, ర్యాలీలు నిర్వహించారు.

అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శెట్టి గంగాధర్ స్వామి, మహమ్మద్ అలి, రామలక్ష్మి, సతీష్, సత్యనారాయణ దొర పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



కంగారుమామిడిలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కంగారుమామిడిలో వైద్యాధికారి పి.రాంబాబు ఆధ్వర్యలు గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 85 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కాచి చల్లర్చిన నీరు తాగాలని , చలి బారి నుంచి రక్షణ కోసం రగ్గులు, ఉన్ని దుస్తులు తప్పక ధరించాలని సూచించారు.



బలిజపేట గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న గెమ్మెలి పీహెచ్‌సీ డాక్టర్ బాబ్జి

జి.మాడుగుల: సుస్థిర వ్యవసాయ కేంద్రం(సీఎస్ఏ)ఎల్ఐసీ హరిడే ప్రాజెక్టు ఆధ్వర్యంలో గెమ్మెలి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బాబ్జీ వంజరి–2 పరిధిలో గల బలిజపేటలో గురువారం వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎల్ఐసీ హరిడే ప్రాజెక్టు మేనేజర్ కమల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.